చకచకా పనులు



51వ వార్డు కళింగనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



చిట్టిబాబు కాలనీలో గెడ్డ బాటం కాంక్రీట్ పనులు చేపడుతున్న కార్మికులు

- 51వ వార్డులో అభివృద్ధి పరుగులు
- సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, గెడ్డ రక్షణ గోడల నిర్మాణాలు

మద్రిపాలెం: అభివృద్ధికి మారుపేరుగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలుస్తోంది. ముఖ్యంగా విశాఖ నగర సమగ్రాభివృద్ధి, సుందరీకరణకు ముఖ్యమంత్రి పెద్దపీట వేశారు. జీవీఎంసీ వార్డుల్లో కోట్ల రూపాయల నిధులతో పనులు చకచకా కొనసాగుతున్నాయి. అనతికాలంలోనే ఎన్నడూ లేని విధంగా వార్డులు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. సీసీ, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, గెడ్డ రక్షణ గోడలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు.. ఇలా అనేక రకాల మౌలిక వసతులకు సంబంధించి ఇటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కేటాయించిన నిధులు.. అటు జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు జోరుగా చేపడుతున్నారు.

నిధులు.. పనులు

జీవీఎంసీ 51వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. కళింగనగర్ వుడా క్వార్టర్స్‌లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లుకు సంబంధించి గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో పనులు నిర్వహిస్తున్నారు. కళింగనగర్‌లో కల్వర్టులు, సీసీ డ్రెయిన్లకు సంబంధించి రూ.16 లక్షలతో జరుగుతున్న పనులకు ఇటీవల నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి శంకుస్థాపనలు చేసిన విషయం తెలిసిందే. చిట్టిబాబు కాలనీలో రూ.39 లక్షలతో గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే గెడ్డ బాటం కాంక్రీట్ నిర్మాణం చేపట్టారు. అంబేడ్కర్ కాలనీకి సంబంధించి రూ.20 లక్షలతో రక్షణ గోడ, కాంక్రీట్ బాటం నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రూ.39 లక్షలతో కళావేదిక నిర్మాణ పనులు చేపడుతురు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అధికారులకు తగు సూచనలిస్తున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం అనేక అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ చేపడుతుండటంపై వార్డు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంబేడ్కర్ కాలనీలో నిర్మిస్తున్న గెడ్డ రక్షణ గోడ



కళావేదిక వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

గ్రామ సభతో సమస్యల పరిష్కారం

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గ్రామ సభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ 271 సచివాలయం పరిధి ఇందిరానగర్-2, 3, 4 ప్రాంతాల ప్రజల సమస్యలపై గురువారం జీవీఎంసీ అధికారుల సమక్షంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గత సోమవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో స్థానికులు సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదులు చేయడంతో గ్రామ సభ నిర్వహించామన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వ పథకాలు అందేటట్లు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సచివాలయ పరిధిలో సమస్యలను కె.కె.రాజు స్వయంగా విని స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో ఆయన మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని కోరారు. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్థానిక ప్రజలకు కె.కె.రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, ఏఈ అర్చన, ఏపీడీ పద్మావతి, పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, జి.నరేష్, హేమంత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గ్రామ సభలో కె.కె.రాజు, జెడ్పీ కృష్ణ, అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న మహిళ

'స్వచ్ఛ సర్వేక్షణ్'పై విస్తృత అవగాహన

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023పై అవగాహన కార్యక్రమాలను జీవీఎంసీ యంత్రాంగం విస్తృతం చేసింది. దీనిలో భాగంగా గురువారం వై.కె.రాజు కళా బృందంచే నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో నగరానికి మెరుగైన ర్యాంకు సాధనకు విశాఖ పౌరుల పాత్రపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయడం, పరిసరాల పరిశుభ్రత, ఎకో వైజాగ్ వంటి అంశాలపై వీధి నాటిక, జానపద గీతాలతో వినియోగదారులకు, రైతులకు వివరించారు. 51, 49 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ సహాయ వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు విడనాడి గుడ్డ సంచులు వాడాలని సూచించారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వీధి నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రజా శ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం



పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు 288 సచివాలయం పరిధి మహత్ కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో మురికివాడ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మురికివాడల్లోని లబ్ధిదారులకు సచివాలయ వ్యవస్థ ద్వారా విశిష్టమైన సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాస్, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 51వ వార్డు నాయకులు పైడి ప్రతాప్, తిరుమలరావు, పప్పల లక్ష్మణ్, శ్యామ్, లత, రత్నం, రాణి, వై.వరలక్ష్మి, ధర్మావతి, పి.అప్పారావు, మాస్టర్, మసీనమ్మ, జగన్, సీనియర్ నాయకులు కృష్ణారావు మాస్టర్, బోగవిల్లి గోవింద్, షేక్ బాబ్జి, సమ్మెట్ల వెంకటేష్, సారిపిల్లి సంతోష్, రమణమ్మ, అశోక్, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యలు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజినికి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రెల్లి వీధిలో స్కీం ఇళ్ల నిర్మాణం సగంలో నిలిచిపోయి 20 ఏళ్లుగా రోడ్డు పక్కన రేకుల షెడ్లలో నివసిస్తున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, కలెక్టర్ ఎ.మల్లికార్జునల దృష్టికి ఈ సమస్యను ఆయన తీసుకెళ్లారు. రెల్లి వీధిలోని బీటీ రోడ్డును డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల రహదారికి కనెక్టివిటీ ఇవ్వాలని కోరారు. దీనిపై వారంతా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారని గోవింద్ తెలిపారు.

త్వరితగతిన పనుల పూర్తి

సీతంపేట: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆదేశించారు. వార్డులోని సీతంపేట మెయిన్ రోడ్డులో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గొల్ల వీధి సాయిబాబా గుడి వరకు, దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్డులో రూ.27.8 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడుతుండటంతో స్థానికులు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా ముగించాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, దుకాణ యజమానులు పాల్గొన్నారు.



సీతంపేట మెయిన్ రోడ్డులో డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

నైపుణ్యాభివృద్ధితో ఉన్నత అవకాశాలు

మురళీనగర్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాభివృద్ధి సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు లభిస్తాయని కేంద్ర సీబీఐ సంస్థ రిటైర్డ్ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి అన్నారు. ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన గురువారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడంతోపాటు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలన్నారు. ఉత్తమ పుస్తకాలు చదవడం ద్వారా నైతిక విలువలు పెంపొందించుకోవచ్చని ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి ఉత్తమ సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సత్తి సునీల్‌రెడ్డితో బహుమతులు పొందిన విద్యార్థులు

కొండవాలులో అభివృద్ధి పనుల పరిశీలన

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం, కైలాసపురం పరిధి కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పరిశీలించారు. శాంతినగర్, కస్తూరినగర్, లక్ష్మీనారాయణపురం, మధుసూదన్‌నగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర పనులను పర్యవేక్షించారు. కొండవాలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌తో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. వార్డును సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులు 90 శాతం పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వాటర్ ఈఈ సూరిశెట్టి శేఖర్, ఏఈ మోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జాగరపు నరేష్, పల్లా చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.గోవింద్, చిన్నా, అప్పారావు, బాల రత్నమాల, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



కస్తూరినగర్‌లో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

రహదారుల ఆక్రమణ.. రాంగ్ పార్కింగ్

సీతంపేట: విశాలమైన రహదారులు వ్యాపారులకు అడ్డాగా మారాయి. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో మహారాణి పార్లర్ నుంచి రామచంద్రానగర్ ఆర్చి వరకు ఇరువైపులా రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మరికొంత మంది వ్యాపారులు దుకాణం ముందున్న మూడొంతుల రహదారిని వినియోగదారుల వాహనాల పార్కింగ్‌తో ఆక్రమించేస్తున్నారు. దీంతో విశాలమైన 80 అడుగుల రహదారి కాస్త వ్యాపారుల ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సాయంత్రం వేళల్లో ఈ మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. అదే సమయంలో ఈ మార్గంలో ఉన్న టిఫిన్ సెంటర్లు, జ్యూస్ షాపులు, తోపుడు బళ్ల వద్ద వినియోగదారుల వాహనాలు పదుల సంఖ్యలో బారులు తీరుతున్నాయి. దుకాణ యజమానులు సైతం వాహనాల పార్కింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని పలువురు చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నా.. ఇటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది కానీ, ట్రాఫిక్ పోలీసులు గాని కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారుల ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో జ్యూస్ షాప్ వద్ద వాహనాల పార్కింగ్

క్లుప్తంగా

నేటి నుంచి గరికిపాటి ప్రవచనాలు

సీతమ్మధార: క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు తరలి రావాలని వారు కోరారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

మద్రిపాలెం: బైకు ఢీకొనడంతో ఓ మహిళకు గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తెన్నేటి నగర్‌కు చెందిన అలపాన లక్ష్మి ఈ నెల 18వ తేదీ రాత్రి తాటిచెట్లపాలెం 28 బస్‌స్టాప్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో రైల్వే న్యూకాలనీ నుంచి తాటిచెట్లపాలెం వైపు వస్తున్న ఓ బైకు ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. దీంతో కేజీహెచ్‌లో లక్ష్మి చికిత్స పొందుతున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు గురువారం సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన విద్యార్థులకు రూ.30 వేల సాయం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న రామరాజు దంపతులు

మధురవాడ: ఇటీవల మధురవాడ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన ఓ వ్యక్తి గురువారం సాయంత్రం ఆర్థిక సాయం అందించారు. డీవీ రామరాజు, సూర్య భాస్కరమ్మ దంపతులు ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, బి.మీనా, పి.సూరిబాబు, యస్.జ్యోతిష్, పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన సిరుల తల్లి కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్తేరు డిపోలో మెగా సామూహిక రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ సిహెచ్.ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సారథ్యంలో జరగనున్న మెడికల్ క్యాంప్‌లో ఉద్యోగులు, కార్మికులు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. హియరింగ్ సొల్యూషన్స్, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ధ్యాన మందిర ప్రాంగణం వద్ద ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించారు. వినికిడి సమస్యల వైద్యుడు డాక్టర్ రమేష్ అంకిల్లా అవగాహన కల్పించారు. సుమారు 70 మందికి వినికిడి పరీక్షలు చేశారు. అవసరమైన పేదలకు వినికిడి మెషీన్లు అందజేయనున్నట్లు మేనేజర్ సురేష్ తెలిపారు.

అన్నదానం, పల్లకీ సేవ..

ధ్యాన మందిరంలో బాబాకు మధ్యాహ్న హారతి సమర్పించిన అనంతరం భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం హారతి అనంతరం పల్లకీ సేవలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పల్లకీ మోశారు. ఈ కార్యక్రమాల్లో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, సాయి సేవకులు పాల్గొన్నారు.



వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న హియరింగ్ సొల్యూషన్స్ ప్రతినిధులు

రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ సీజీఎం రతన్‌రాజ్

అల్లిపురం: రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి చేస్తోందని కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ వి.రతన్ రాజ్ తెలిపారు. విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో అధికార భాషా వార్షిక సదస్సు-2023 గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో రాజభాష హిందీని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ హెచ్‌ఆర్ జి.కిరణ్‌కుమార్, జనరల్ మేనేజర్ లాలన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న శుభ, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మురళీమాధవ విద్యాలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతిలో 500 మార్కులు దాటిన ఆరుగురు విద్యార్థులకు వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. బాలురలో అత్యధిక మార్కులు సాధించిన శేఖర్(553)కు రూ.1,500, ద్వితీయ స్థానం సాధించిన రజని(545)తోపాటు ఇతరులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాధవవిద్యాలయం అధినేతలు సనపల మురళీధర్, సత్యవతి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షులు లీలా నాయుడు, సిహెచ్.వరలక్ష్మ , పూర్వ అధ్యక్షులు కె.మాధవి, ఇ.శిరీష, జాలీ వాకర్ మాధవీలత, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సుభాషిణి, జాయింట్ సెక్రటరీ ఎ.జయశ్రీ, పూర్ణిమ ఎ.లక్ష్మి, ఎం.మహాలక్ష్మి, గీతా భాను పాల్గొన్నారు.

ఎంవీపీలో పెన్షనర్ల సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా సంక్షేమ శాఖల పూర్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం సమావేశం గురువారం ఎంవీపీ కాలనీ సాంఘిక సంక్షేమ శాఖ సమావేశ మందిరంలో జరిగింది. పెద్ద ఎత్తున సభ్యులు హాజరై పలు అంశాలపై చర్చించారు. పెన్షన్ పొందే క్రమంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి నెలా పెన్షన్ సకాలంలో బ్యాంకు ఖాతాలో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ దిశగా సంఘ ప్రతినిధులు చొరవ చూపాలని సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావును కోరారు. పెన్షనర్లు వారి సమస్యలను సంఘ ప్రతినిధులకు వివరించారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

దాబాగార్డెన్స్: ఆలిండియా బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు గురువారం పలు సమస్యలు పరిష్కరించాలంటూ డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టి డీజీఎంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ క్యాజువల్ సిబ్బందికి బీఎస్ఎన్ఎల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, మెడికల్ ఫెసిలిటీ కల్పించాలని, 4జీ వెంటనే ఇవ్వాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌కు ప్రభుత్వం చెప్పే విధంగా జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లింగమూర్తి, సూర్యప్రకాష్, పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, సారిపల్లి శ్రీను, ప్రేమ్‌కుమార్, నాగిరెడ్డి, సింహాచలం, గోవిందరావు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు లేక ఇబ్బందులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు శ్రీనివాసనగర్, బర్మాక్యాంప్ సచివాలయం 1086272 పరిధిలో విద్యుత్ స్తంభానికి లైట్లు లేకపోవడంతో అంధకారం నెలకొంది. మూడు నెలలుగా విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. పోల్ నంబర్ 190/ఏ/5/3కు లైట్ తొలగించి నెలలు గడిచినా కొత్తది వేయలేదు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.



బర్మాక్యాంప్‌లో లైటు లేని విద్యుత్ స్తంభం

- కె.రామకృష్ణ, బర్మాక్యాంప్